AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
29-11-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

## పాతగంజ్‌లో స్వచ్ఛభారత్



2

## అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం



2

## అవినీతికి అడ్డాగా ఆర్మూర్ బల్దియా



ఆర్మూర్ మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సెక్షన్లతో పాటు జనన, మరణ, సానిటరీ విభాగాల్లో అవినీతి తారాస్థాయికి చేరినట్లు ఆరోపణలున్నాయి. ముడుపులు ముట్టజెప్పనిదే ఫైల్ ముందుకు కదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

– వివరాలు 2వ పేజీలో..



## కాళేశ్వరంతో ఉమ్మడి జిల్లాకు నీళ్లివ్వలేదు

**అక్షరటుడే, ఇందూరు:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని కల్వకుంట్ల కవిత అన్నారని.. ఆ మాటలు వాస్తవమేనని తెలంగాణ జాగృతి జిల్లా అడ్‌హక్ కమిటీ సభ్యుడు అవంతి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021 కొండపోచమ్మ సాగర్ నుంచి హల్దీ వాగు ద్వారా నిజాంసాగర్‌కు గోదావరి నీళ్లు చేరాయన్నారు. అయితే.. ఆ ఏడాది యాసంగి సీజన్‌ను కాపాడేందుకు మాత్రమే ఉపయోగించారన్నారు. ఆ తర్వాత నిజాంసాగర్‌కు ఎప్పుడూ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని అందించాల్సిన అవసరం రాలేదన్నారు. సమావేశంలో జాగృతి ప్రతినిధులు సూదం రవిచందర్, గంగారెడ్డి, రాజు, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



## సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్యపై, ఎన్‌కౌంటర్‌లో మరణించిన రియాజ్ సంఘటనపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ప్రమోద్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. వారి పిల్లలను ప్రభుత్వమే చదివించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రమోద్ చిన్న కుమారుడు, ప్రమోద్ తల్లికి అనారోగ్యానికి గురయ్యారని.. వారికి ప్రభుతమే వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణరావు, రాష్ట్ర నాయకులు వి.సంగం, రాష్ట్ర సహాయ కార్యదర్శులు బాలయ్య, అల్గోట్ రవీందర్, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి జలంధర్ పాల్గొన్నారు.



## రాష్ట్రానికి దశ దిశ మార్చిన ఘనత కేసీఆర్‌దే..: బాజిరెడ్డి గోవర్ధన్

**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ సాధనతో రాష్ట్ర దశ, దిశ మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. 16 ఏళ్ల క్రితం నవంబర్ 29న తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో నినాదంతో నిరాహార దీక్షను కేసీఆర్ ప్రారంభించారన్నారు. దీక్షా దివస్ సందర్భంగా శనివారం బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు బీఆర్ఎస్ కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజి రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ జుబేర్, మోచి గణేష్, సాయిబాబా, రమేష్ యాదవ్, నాయిని మొగులయ్య పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. మూడు దశల్లో నిర్వహించనున్న ఎన్నికల్లో తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని 21 మండలాల్లో మొదటి దశలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. నామినేషన్ వేసిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

– అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి



# ముగిసిన తొలి విడత నామినేషన్లు

▸ ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామాల్లో జోరందుకున్న ప్రచారం ▸ రేపటి నుంచి రెండో విడత నామినేషన్లు

మొదటి విడత ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ 11 మండలాల్లో, కామారెడ్డి జిల్లాలో 10 మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ డివిజన్‌లో 184 గ్రామపంచాయతీలు,1,642 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం 1,653 పోలింగ్ స్టేషన్లను సిద్ధం చేశారు. గ్రామపంచాయతీలు, వార్డు స్థానాలకు భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈనెల 30న నామినేషన్లను స్క్రూటినీ చేయనున్నారు. డిసెంబర్ 1వ తేదీన అప్పీల్‌కు అవకాశం కల్పించారు. అలాగే 3వ తేదీన విత్ డ్రా చేసుకునేందుకు వీలు కల్పించారు. అదే రోజు ఫైనల్ లిస్ట్‌ను ప్రకటిస్తారు. డిసెంబర్ 11 ఎన్నికలు నిర్వహించి, అదే రోజు లెక్కింపు చేసి విజేతలను ప్రకటిస్తారు.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొదటి విడతలో 10 మండలాల్లోని 167 గ్రామాల సర్పంచ్‌లు, 1520 వార్డులు ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం 1533 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు.


### రేపటి నుంచి రెండో విడత..

తొలి విడత నామినేషన్లు శనివారం ముగియడంతో... ఆదివారం నుంచి రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. నిజామాబాద్ డివిజన్‌లోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాల్లోని 196 గ్రామపంచాయతీలకు, 1,760 వార్డు స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. డిసెంబర్ 2వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

### గెలుపు గుర్రాలతో నామినేషన్లు

ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాయి. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ గుర్తులు ఉండవు. దీంతో ఆయా పార్టీల మద్దతులో అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారు. ఆయా పార్టీల పెద్దలు స్థానిక ఎన్నికలను కీలకంగా తీసుకున్నారు. ఈ మేరకు అన్ని రకాలుగా పలుకుబడి ఉన్న వారితో నామినేషన్లు వేయించారు. ఆయా పార్టీల నాయకులు, అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ గెలుపుతో ఉత్సాహంగా ఉంది. గ్రామ పంచాయతీల్లోనూ తమ మద్దతు దారులను గెలిపించుకునే దిశగా కదులుతుంది. ప్రధానంగా రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ప్రధాన అస్త్రంగా వాడుకుంటూ తమ మద్దతుదారులను గెలిపించుకోవాలని చూస్తుంది. అలాగే బీజేపీ కేంద్ర పథకాలను, మోదీ చరిష్మాను వాడుతూ అత్యధిక సీట్లు గెలవాలనే వ్యూహంతో అడుగులు వేస్తోంది. ఇక బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, బీసీ నినాదం, బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి తదితర అంశాలను చర్చకు పెడుతోంది.

## తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చిన వ్యక్తి కేసీఆర్: జీవన్‌రెడ్డి



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ రాష్ట్ర రూపురేఖలు మార్చిన వ్యక్తి కేసీఆర్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని అమరువీరుల పార్కులో స్థూపానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2009 నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్షకు దిగితే పోలీసులు ఖమ్మం జైలుకు తరలించారన్నారు. అక్కడి నుంచి ఆయన మొదలుపెట్టిన పోరాటంతో డిసెంబర్ 9న ప్రత్యేక రాష్ట్ర ప్రకటన వచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జడ్పీఛైర్మన్ విఠల్ రావు, ఆయేషా ఫాతిమా, మాజీ మేయర్ నీతూకిరణ్, ఉద్యమకారులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పనిచేయాలి

**అక్షరటుడే, ఇందూరు :** ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఆర్‌వోలు, ఏఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వహించవచ్చన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని శిక్షణా తరగతుల్లో సూచించే అంశాలను శ్రద్ధగా విని, ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతాను తెరవాల్సి ఉందని, ఈ ఖాతా ద్వారానే ఎన్నికల కార్యకలాపాలకు సంబంధించిన లావాదేవీలు జరపాలని ఈసీ నిర్దేశించినందున అభ్యర్థులకు విషయాన్ని తెలియజేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను ఈసీ మార్గదర్శకాలకనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అభ్యర్థి ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. తిరస్కరణకు ఎన్ని గురయ్యాయి అందుకు గల కారణాలు వెల్లడించాలని తెలిపారు. ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన మీదట బ్యాలెట్ పత్రాన్ని జాగ్రత్తగా రూపొందించాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు వాటికి కేటాయించిన గుర్తులతో పాటు నోటా సింబల్‌ను కూడా తప్పనిసరిగా చేర్చాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, డీఎల్‌పీవో శ్రీనివాస్, ఆర్వోలు, సహాయ ఆర్‌వోలు పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

## 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్న జవాన్‌కు సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన ఎక్కపల్లి తండా యువకుడు మున్యానాయక్ ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో పాలుపంచుకున్నాడు. ఇటీవల ఆయన తండాకు విచ్చేశాడు. ఈ సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలకు తెగించి చేసిన ఈ సేవకు గాను కాంగ్రెస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు కుర్మ సాయిబాబా, నాయకులు మున్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. ఆయన దేశానికి చేసిన సేవలు పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు.

## డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రి సీబీసీఎస్‌ఈ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 30 సెంటర్లలో ఒకటో, మూడో, ఐదో, సెమిస్టర్ రెగ్యులర్, రెండో, నాల్గో, ఆరవ సెమిస్టర్ (2021, 2022, 2023, 2024, 2025 బ్యాచ్‌ల) బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. తొమ్మిదో రోజు శనివారం ఉదయం జరిగిన పరీక్షలకు 5,317 మంది విద్యార్థులకు గాను.. 5,068 మంది హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 5,799 మంది విద్యార్థులకు గాను 5,314 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆర్మూర్‌లో ఇద్దరు డిబార్ అయ్యారని ఆయన వివరించారు.

## హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా అధికారులు





**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాధవి దేవి శనివారం బాసర వెళ్తూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆగారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద హైకోర్టు న్యాయమూర్తిని జిల్లా జడ్జి జీవీఎన్ భరతలక్ష్మి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందించారు. అనంతరం వారితో హైకోర్టు న్యాయమూర్తి కొద్దిసేపు భేటీ అయ్యారు.



## వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లా కేంద్రంలోని చిన్న మల్లారెడ్డిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం సందర్శించారు. వరి కొనుగోళ్లను పరిశీలించి.. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరి కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. అవసరమైన టార్పాలిన్ షీట్లు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీగా ఎన్ని క్వింటాళ్ల వరి లోడింగ్ జరుగుతున్నదన్న దానిపై పర్యవేక్షణ పెంచాలని ఐకేపీ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వరి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్స్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం శ్రీకాంత్, ఏపీఎం మెప్మా శ్రీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



## డిసెంబర్ 1న డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని లక్ష్మి కల్యాణ మండపంలో డిసెంబర్ 1న డీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు నూతనంగా నియమితులైన డీసీసీ ప్రెసిడెంట్ నగేశ్ రెడ్డి తెలిపారు. తన నివాసంలో శనివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. తన ప్రమాణ స్వీకారానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. తనపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించినందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు నగేశ్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ మద్దతుదారులను అధిక సంఖ్యలో గెలిపించుకుంటామన్నారు. కొంతమంది బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన ప్రతిపక్ష నాయకులు సర్పంచ్ ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుంటే కోర్టు వాటిని తిరస్కరించిందన్నారు. లోకల్ బాడీ ఎన్నికల్లో జిల్లాలో ఉన్న అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామన్నారు. తద్వారా జిల్లా పరిషత్‌పై కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న అన్ని మున్సిపాలిటీల్లో అధికసంఖ్యలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లను గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో నుడా ఛైర్మన్ కేశ వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, నగర అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, జావేద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూరు మండలంలోని కల్లెడి గ్రామంలోని ఉన్నత పాఠశాల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గంగాధర్, ఎస్సై రాజశేఖర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సదుపాయాలు, భద్రతా అంశాలు, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో షెడ్లు, తాగునీటి ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. పోలింగ్ రోజు నిర్వహణలో ఎటువంటి లోపాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజలింగ, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## జోరుగా నామినేషన్లు



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్, కోటగిరి ఉమ్మడి మండలాల్లో సర్పంచ్ వార్డుమెంబర్లకు చివరిరోజు కావడంతో జోరుగా నామినేషన్లు కొనసాగుతున్నాయి. సర్పంచులకు యువత అధిక మొత్తంలో ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా పలువురు వారి బంధువులు అనుచరులతో వచ్చి, నామినేషన్లు వేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని జంగమయ్యపల్లి, మత్తమల్, మల్కాపూర్‌లలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో తాహెరా బేగం, ఎంపీవో ప్రకాశ్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రాథమిక సదుపాయాలు, భద్రతా అంశాలు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, షెడ్లు, తాగునీటి ఏర్పాట్లు, విద్యుత్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శిలకు ఆదేశించారు.

## మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డిపై మానాల వ్యాఖ్యలు సరికావు



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిపై రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను భీమ్‌గల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఆ విషయం తెలుసన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన కీలక హామీలను పక్కనబెట్టి, కేవలం ఓట్ల కోసమే ప్రజలు మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గున్నాల భగత్, బోదిరె నర్సయ్య, మల్లెల ప్రసాద్, తుక్కాజీ నాయక్, మహమ్మద్ ఇక్రమ్, రహమన్ సిద్ధిఖీ, సత్య గంగయ్య, యువ నాయకులు రాంచందర్ గౌడ్, జాన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మల్లుపేటలో నామినేషన్ల బహిష్కరణ



**అక్షరటుడే, కామారెడ్డి :** 'మా గ్రామం మీదుగా జాతీయ రహదారి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదు. అందుకే నామినేషన్స్ బహిష్కరిస్తున్నాం' అంటూ శనివారం సదాశివనగర్ మండలం మల్లుపేట గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. నామినేషన్ల దాఖలుకు శనివారం చివరి రోజు కావడంతో అధికారులు గ్రామస్థులతో చర్చించారు. ఈ విషయమై సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్థులు సమావేశమై నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సర్పంచ్ స్థానానికి ఇద్దరు, వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్కరు చొప్పున నామినేషన్లు వేశారు.

**ఆర్మూర్ మున్సిపాలిటీలో అవినీతి రాజ్యమేలుతోంది. ఏ చిన్న పని కోసం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లినా చేతులు తడపనిదే పని జరగడం లేదు. కిందిస్థాయి అధికారి మొదలుకొని పైస్థాయి అధికారి వరకు తలా ఇంత రేటును ఫిక్స్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.**

**- అక్షరటుడే, ఆర్మూర్**




# అవినీతికి అడ్డాగా ఆర్మూర్ బల్దియా..

▸ **కార్యాలయంలో మధ్యవర్తుల హవా**

ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అమ్యామ్యాలు ముట్టజెప్పనిదే ఫైల్ ముందుకు కదలడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ఇవ్వకపోతే ఏవేవో కారణాలను చూపుతూ ఫైల్‌ను తొక్కి పెట్టుతున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఇటీవల ఓ ఇంటి అనుమతి విషయంలో రూ.20వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే.

ఆర్మూర్ మున్సిపాలిటీ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ సెక్షన్లతో పాటు జనన, మరణ, సానిటరీ విభాగాల్లో అవినీతి తారాస్థాయికి చేరినట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల పట్టణాభివృద్ధికి రూ.18 కోట్ల నిధులు మంజూరు కాగా తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు పనులు కేటాయించినట్లు సమాచారం. ఇప్పటికే కొంత మొత్తంలో డబ్బులు అధికారులకు చేరినట్లు తెలిసింది.

### మధ్యవర్తులతో..

మున్సిపాలిటీలో మధ్యవర్తుల హవా జోరుగా సాగుతోంది. ఆయా శాఖల అధికారులను కొందరు మచ్చిక చేసుకొని వారికి మామూళ్లు ఇస్తూ పనులు చేయించుకుంటున్నారు. అధికారులు కార్యాలయంలోని అవుట్ సోర్సింగ్ సిబ్బందిని ఒకరిద్దరూ మధ్యవర్తులుగా చేసుకొని ఈ వ్యవహారాలను చక్కదిద్దుతున్నారు. ప్రతిరోజూ లంచాలు తీసుకుంటూ.. ఆఫీస్ ముగిసిన తర్వాత ఎవరికి రావాల్సిన వాటా వారు పంచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### అధికారుల్లో భయం

ఆర్మూర్ మున్సిపల్ అధికారుల్లో భయం చుట్టుకుంది. రెండు రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ రాజు ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో కార్యాలయంలో ఒకసారిగా అలజడి నెలకొంది. నాటి నుంచి మున్సిపల్ కార్యాలయంలోని పలు సెక్షన్లకు సంబంధించిన ప్రధానాధికారులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని ఆఫీసుకు దూరంగా ఉన్నారు. మరికొన్ని సెక్షన్‌లో ఉన్న అధికారులు కార్యాలయానికి తూతు మంత్రంగా వచ్చి వెళ్లిపోతున్నారు. కమిషనర్ ఏసీబీకి చిక్కిన నాటి నుంచి కార్యాలయంలో నిశబ్దం నెలకొంది. అవినీతి నిరోధక శాఖ అధికారులు లోతైన విచారణ జరిపితే మరికొందరు అధికారుల చిట్టాలు బయటపడే అవకాశం ఉంది. దీంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

## దీక్షా దివస్‌కు అనుమతి నిరాకరించడం అన్యాయం

**అక్షరటుడే, డిచ్‌పల్లి :** తెలంగాణ యూనివర్సిటీ ఎదుట కేసీఆర్ దీక్షా దివస్ కార్యక్రమానికి మొదట అనుమతి ఇచ్చి.. అనంతరం నిరాకరించడం అన్యాయమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజారాం యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనం ఎదుట శనివారం నాయకులతో కలిసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్షా దివస్‌కు అనుమతి నిరాకరించడంలో కాంగ్రెస్ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్షకు కూర్చుంటే పోలీసులు ఖమ్మం జైలుకు తరలించారని.. అక్కడి నుంచి ఆయన చేసిన దీక్షతోనే డిసెంబర్ 9న ప్రత్యేక రాష్ట్ర ప్రకటన వెలువడిందన్నారు. ఈ మేరకు రాష్ట్రమంతటా దీక్షా దివస్ నిర్వహిస్తుంటే.. తెయూ ఎదుట కార్యక్రమ నిర్వహణను పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. తెయూ గేట్ వద్ద దీక్ష శిబిరం వద్ద టెంట్ కూల్చివేసి..ఫ్లెక్సీని చించివేయడం అమానుషమన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ పెద్దలు పీసీసీ చీఫ్



మహేశ్ గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఒత్తిడితో పోలీసులు తమ శిబిరానికి అనుమతి నిరాకరించారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో రాజారాం యాదవ్‌తో విద్యార్థి నాయకులు సంతోష్, నాగేంద్ర, నిరంజన్, బీఆర్ఎస్ నాయకులు కుమార్, లింగం యాదవ్, బొట్టు శ్రీనివాస్ యాదవ్, రాగుల అశోక్ పటేల్, జక్కుల రాజేందర్ యాదవ్, పసుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** అంగన్‌వాడీల్లో బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని అంగన్‌వాడీ టీచర్ సరిత అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామంలో 245 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య (ఎర్లీ చైల్డ్ హుడ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2030 నాటికి దేశవ్యాప్తంగా నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల సమగ్రాభివృద్ధి, సంరక్షణ అందరికీ అందించడమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా పసుపుల లక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.



## కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ఆవిర్భావం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ఆవిర్భావం సాధ్యమైందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ.. నవంబర్ 29వ తేదీ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని అన్నారు. ఆ రోజు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి, మొక్కవోని పట్టుదలతో దీక్ష చేసి, ఢిల్లీ మెడలు వంచారని గుర్తు చేశారు.

## పాతగంజ్‌లో స్వచ్ఛభారత్



**నగరంలోని పాత గంజ్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్పా గంగారెడ్డి, ఐదు కళాశాలల విద్యార్థులు, తెలంగాణ యూనివర్సిటీ లెక్చరర్లు సైతం పాల్గొన్నారు.**

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## మాసన్‌పల్లి సర్పంచ్ పాలకవర్గం ఏకగ్రీవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలంలోని మాసన్‌పల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా పెద్దపట్లోళ్ల సునంద కిషన్ రెడ్డితో పాటు వార్డు సభ్యులుగా బొల్లారం లక్ష్మి, నాగులూరి అంజవ్వ, లోక లింగవ్వ, గంగారబోయిన దుర్గవ్వ, గంగారబోయిన సంగవ్వ, శ్యామల సుగుణవ్వ, చిన్నపట్లోళ్ల సుమలత, నాసిరి సంతోషిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఎన్నికలు లేకుండా ఏకతాటిపై ఉండేందుకు సర్పంచ్ వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



**అక్షరటుడే, ఆర్మూర్:** పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్లను ట్రేసవుట్ చేసి శనివారం బాధితులు దీప రాణి, శ్రీనివాస్, రవి పోహార్, అబ్దుల్ అజీజ్‌లకు అప్పజెప్పినట్లు ఆయన వివరించారు. ఎవరిదైనా సెల్‌ఫోన్ చోరీకి గురయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్ర నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, నేరెళ్ల ఆంజనేయులు, పైడి ఎల్లారెడ్డి అన్నారు. పార్టీ ఎల్లారెడ్డి కార్యాలయంలో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాజకీయ శక్తిగా ఎదగాలన్నారు. ఇన్ని రోజులు కాషాయ జెండా పట్టిన ప్రతి కార్యకర్త ఇప్పుడు కరపత్రాలు పట్టి గడపగడపకు తిరిగి ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులను వివరించాలన్నారు. ఈ సందర్భంగా లింగంపేట్ మండలం పోల్కంపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావ్, బీజేపీ సీనియర్ నాయకులు దేవేందర్, ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడు నర్సింలు, లింగంపేట్ మండలాధ్యక్షుడు క్రాంతి, నాగిరెడ్డి పేట్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నాగిరెడ్డి పేట్ మాజీ మండలాధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు పాల్గొన్నారు.



## గొల్లాడి తండాలో సర్పంచ్, వార్డు మెంబర్ల ఏకగ్రీవం

**అక్షరటుడే, గాంధారి:** గాంధారి మండలం గొల్లాడి తండావాసులు సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్ల ఏకగ్రీవ ఎన్నికకు తీర్మానం చేశారు. ఈ మేరకు శనివారం సర్పంచ్, వార్డు మెంబర్లందరినీ ఏకగ్రీవం చేస్తూ తీర్మానించుకున్నారు. గొల్లాడి తండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అంకోత్ సవిత గణేష్, ఉపసర్పంచ్‌గా బస్సీ భారత్య, వార్డు మెంబర్లుగా బస్సీ సంగీత్ ధన్‌రాజ్, కేతావత్ శ్రీనివాస్, అంగోద్ బులి సైవారం, బస్సీ కంసల్య చమున, బస్సు రవీందర్ ధరాత్ హుకినీ భాయ్, బస్సీ హరిలను గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.